స్పిరిట్ కోసం హాలీవుడ్ విలన్?

ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' స్పీడ్ మామూలుగా లేదు. ఇప్పటికే వెయ్యికోట్ల మార్క్‌కు చేరవగా వచ్చేసింది. మరి ఈ వేగానికి బ్రేక్ ఎక్కడ పడుతుందో ఇప్పుడైతే ఎవరికీ క్లారిటీ లేదు. ఈ ప్రయాణంలో ఎన్ని రికార్డులు బద్దలవుతాయో కూడా చెప్పలేం. ఇప్పటికే పాన్ ఇండియా సూపర్‌స్టార్‌గా ఎదిగిన ప్రభాస్, 'కల్కి 2898ఏడీ' దెబ్బకి పాన్‌వరల్డ్ సూపర్‌స్టార్‌గా మారారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందుకేనేమో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తన 'స్పిరిట్' సినిమాను పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ సినిమా బడ్జెట్ మూడొందల కోట్ల పైనే అని తెలుస్తున్నది. టి.సిరీస్, భద్రకాళి ప్రొడక్షన్స్ కలిసి నిర్మించనున్న ఈ పాన్ వరల్డ్ సినిమాలో విలన్‌గా హాలీవుడ్ స్టార్ విలన్ లీ డాంగ్ సిక్‌ని తీసుకునేదుకు నిర్ణయించారట. అప్పుడే ఆయనతో సంప్రదింపులు కూడా మొదలయ్యాయని సమాచారం. ట్రైన్ టూ బూసాన్, మార్వెల్ సిరీస్ ఎటర్నల్ సినిమాల ద్వారా ఈ సౌత్ కొరియన్ యాక్టర్ ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా కథ ఇంటర్నేషనల్ స్థాయిలో ఉంటుందట. అందుకే హాలీవుడ్ నటులపై దృష్టిసారించారు సందీప్‌రెడ్డి వంగా. ఇందులో ప్రభాస్ రెండు భిన్న కోణాల్లో కనిపిస్తారట. అందులో ఒకటి రఫ్ అండ్ రగ్గడ్‌గా ఉంటే.. రెండోది స్టైలిష్‌గా ఉంటుందట. ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్‌ఆఫీసర్‌గా కనిపిస్తారని గతంలో సందీప్‌రెడ్డి చెప్పారు. మరి ఈ రెండు గెటప్పుల్లో పోలీస్ గెటప్ దేనిదో తెలియాల్సివుంది. ఇందులో ప్రభాస్‌ది డ్యూయెల్ రోలా? లేక ఒకే పాత్రలో రెండు పార్శ్వాలుంటాయా? అనే విషయంలో కూడా క్లారిటీ రావాల్సివుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది.

రాధిక 3.0గా ప్రియాంక?

టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలు సక్సెస్ సాధించడం చాలా అరుదు. కానీ ప్రియాంక జవాల్కర్ తొలి సినిమా 'టాక్సీవాలా' తోనే హిట్ కొట్టేసి, లక్కీ హీరోయిన్ అనిపించుకుంది. చూడ్డానికి నార్త్ అమ్మాయిలా ఉండటం కూడా ప్రియాంకకు కలిసొచ్చిందని చెప్పాలి. రెండో సినిమా 'ఎస్ఆర్ కళ్యాణమండపం'తో ద్వితీయ విఘ్నాన్ని కూడా దాటేసింది. హిట్టయిన రెండూ చిన్న సినిమాలే కావడంతో ప్రియాంకకు అవకాశాలు పెద్దగా రాలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ అందాల భామ బంపర్‌ఆఫర్ కొట్టేసిందని తెలుస్తున్నది. 'టిల్లు స్క్వేర్'లో క్షణకాలం మెరిసిన ప్రియాంక, 'టిల్లు క్యూబ్'లో రాధిక 3.0గా కనిపించనుందని ఇన్‌సైడ్ టాక్. 'డీజే టిల్లు'లో రాధికగా నేహాశెట్టి నటించింది. ప్రస్తుతం అందరూ ఆమె పేరును మర్చిపోయి, రాధిక అనే పిలుస్తున్నారు. 'టిల్లు స్క్వేర్'లో కథానాయిక లిల్లీగా అనుపమాపరమేశ్వరన్ నటించినా, ఆమెను అందరూ రాధిక 2.0 అనే పిలుస్తున్నారు. ఇప్పుడు 'టిల్లూ క్యూబ్'లో ప్రియాంక జవాల్కర్ నటించనున్నట్టు వార్తలు బలంగానే వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే ఈ ముద్దుగుమ్మ కూడా రాధిక 3.0గా మారిపోవడం ఖాయం. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ వేరే సినిమా పనిలో బిజీగా ఉన్నారు. ఆ సినిమా తర్వాత 'టిల్లూ క్యూబ్' ఉంటుందని తెలుస్తున్నది.

ఇది పొగరుతో చెబుతున్న మాట కాదు

'అస్కార్ అవార్డును ప్రత్యేకంగా పరిగణించను. భారతీయ నటుడిగా ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలన్నదే నా కల. ఇది పొగరుతో చెబుతున్న మాట కాదు. నాపై నాకున్న నమ్మకంతో చెబుతున్న మాట.' అని కమల్‌హాసన్ అన్నారు. ఆస్కార్ అవార్డు గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కమల్ పై విధంగా స్పందించారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'భారతీయుడు 2'. 1996లో వచ్చిన 'భారతీయుడు' సినిమాకు సీక్వెల్‌గా శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్ మాట్లాడారు. 'సినిమాకు కథే ముఖ్యం. కథ డిమాండ్ మేరకే పాత్రలుండాలి. ఈ సినిమాలో కమల్‌సార్ పాత్ర నిడివి తక్కువ అని చాలామంది అనుకుంటున్నారు. అందులో నిజంలేదు. ఇందులో ఆయన లేని సన్నివేశంలో కూడా ఆయన గురించే చర్చ నడుస్తుంటుంది. పార్ట్ 1లో అవినీతిపై పోరాటం చూపించాను. ఈ పార్ట్‌లో పోరాటం వైవిధ్యంగా ఉంటుంది.' అని శంకర్ అన్నారు. కథ డిమాండ్ మేరకే మూడో పార్ట్ కూడా తెస్తున్నామని, డబ్బుకోసంకాదని, 'భారతీయుడు2' యూనివర్సల్ సబ్జెక్ట్ కాబట్టే ఇన్ని పార్టులు తీయాల్సి వచ్చిందని శంకర్ తెలిపారు. 'భారతీయుడు 2'లో భాగం కావడంపట్ల హీరో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్ ఆనందం వెలిబుచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఈ సినిమాకు పంపిణీదారుడైన ప్రముఖ నిర్మాత డి.సురేశ్ బాబు, బాబీ సింహా కూడా పాల్గొన్నారు.

యాక్షన్ ఘట్టాల్లో 'మట్కా'

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకుడు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన యథార్థ ఘటనల ఆధారంగా పీరియాడిక్ మూవీగా తెరకెక్కిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. విజయ్ మాస్టర్ నేతృత్వంలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ పోరాట ఘట్టాల్లో హీరో వరుణ్‌తేజ్ రిస్కీ స్టంట్స్ పర్‌ఫార్మ్ చేస్తున్నాడని, ఈ ఫైట్ సీక్వెన్స్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, యథార్థ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రం ప్రతి ఒక్కరికి నచ్చుతుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్ రెడ్డి, రజనీ తాళ్లూరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

తమిళ అగ్రనటుడు విజయ్ నటిస్తున్న చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్'. వెంకట్‌ప్రభు దర్శకుడు. కల్పతి ఎస్.అఘోరం, కల్పతి ఎస్.గణేశ్, కల్పతి ఎస్.సురేశ్ నిర్మాతలు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు దేశవ్యాప్తంగా అద్భుతమైన స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా ఆంధ్ర, తెలంగాణ పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాణ, పంపిణీసంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్.ఎల్.పి. సొంతం చేసుకున్నారు. రెండు తెలుగురాష్ట్రాల్లో భారీగా సినిమాను విడుదల చేయనున్నట్టు వారు తెలిపారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహా, లైలా కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ నుని, సంగీతం: యువన్ శంకర్‌రాజా, నిర్మాణం: ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై.లిమిటెడ్.

ప్రేమకు నిర్వచనం ఉషాపరిణయం

స్వయంవరం, నువ్వేకావాలి, నువ్వునాకునచ్చావ్, మన్మథుడు, మల్లీశ్వరి.. ఈ లైనప్ చాలా దర్శకుడిగా కె.విజయభాస్కర్ ఏంటో చెప్పడానికి. మనసుల్ని బరువెక్కించే ప్రేమకథల్ని తెరకెక్కించడంలో సిద్ధహస్తుడు కె.విజయభాస్కర్. ఆయన నుంచి వస్తున్న మరో క్యూట్ లవ్‌స్టోరీ 'ఉషాపరిణయం'. విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్, తెలుగమ్మాయి తాన్వి ఆకాంక్ష ఈ చిత్రం ద్వారా హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. కె.విజయభాస్కర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. భావోద్వేగాలతో కూడిన సరికొత్త ప్రేమకథ ఇదని, సినీప్రేమికులకు ఈ సినిమా విందుభోజనంలా ఉంటుందని, ప్రేమకు తానిస్తున్నే నిర్వచనమే ఈ సినిమా అని దర్శక,నిర్మాత కె.విజయభాస్కర్ తెలిపారు. సూర్య, రవి, శివతేజ, అలీ, వెన్నెలకిశోర్, శివాజీరాజా, ఆమని, సుధ, ఆనంద్, చక్రపాణి, రజిత, బాలకృష్ణ, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీశ్ ముత్యాల, సంగీతం: ఆర్.ఆర్.ధ్రువన్.

అమ్మలాలో రామ్ భజన..

గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఫన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆయ్'. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి అంజి కె.మణిపుత్ర దర్శకుడు. జీఏ2 పిక్చర్స్ పతాకంపై, అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్, విద్యా కొప్పినీడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా ఆగస్ట్ 15న విడుదల కానుంది. ఇప్పటివరకూ విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన స్పందన వస్తున్నదని చిత్రబృందం ఆనందం వెలిబుచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ఓ వెరైటీ పాటను మేకర్స్ విడుదల చేశారు. 'పేరు లేదు ఊరు లేదు ప్రేమించేసిందండోయ్.. అహా.. అమ్మలాలో రామ్ భజన.. మాట లేదు.. మనువు లేదు.. మనసిచ్చేసిందండోయ్.. అమ్మలాలో రామ్ భజన..' అంటూ పద్మావతీ, వేంకటేశ్వరస్వామిల ప్రేమను తెలుపుతూ బుర్రకథ పంథాలో సాగే ఈ పాటను దర్శకుడు అంజి కె.మణిపుత్ర రాయగా, అజయ్ అరసాడ స్వరపరిచారు. పెంచల్‌దాస్ ఆలపించారు. తెలుగు సంప్రదాయానికీ, సంస్కృతికీ అద్దంపట్టేలా ఈ పాట చిత్రీకరించామని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ కల్యాణి.

'దురంధర్'లో సంజయ్‌దత్

'కేజీఎఫ్-2' చిత్రంలో అధీరా పాత్రలో అద్భుతమైన విలనీ పండించి ఆకట్టుకున్నారు సీనియర్ నటుడు సంజయ్‌దత్. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న 'డబుల్ ఇస్మార్ట్'లో సైతం ఆయన ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. తాజాగా సంజయ్‌దత్ భారీ పాన్ ఇండియా చిత్రంలో భాగం కాబోతున్నారు. 'యురి- ది సర్జికల్ స్ట్రైక్' ఫేమ్ ఆదిత్యదర్ దర్శకత్వంలో 'దురంధర్' పేరుతో మల్టీస్టారర్ చిత్రం తెరకెక్కనుంది. ఇందులో రణ్‌వీర్‌సింగ్, ఆర్.మాధవన్, అర్జున్ రాంపాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్పై థ్రిల్లర్ కథాంశమిదని సమాచారం. విదేశాల్లో చేపట్టిన ఆపరేషన్‌ను ఇండియన్ గూఢచారులు ఎలా విజయవంతం చేశారన్నదే చిత్ర ఇతివృత్తమని సమాచారం. ఈ చిత్రంలో సంజయ్‌దత్ భాగం కాబోతున్నారు. ఇందులో ఆయన క్యారెక్టర్ నెగెటివ్ షేడ్స్‌తో సాగుతుందని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీప్రొడక్షన్స్ కార్యక్రమాలను జరుపుకుంటున్నది.

సస్పెన్షన్ ఎత్తివేయండి

బెంగళూరు డ్రగ్స్ కేసు నేపథ్యంలో సినీ నటి హేమ సభ్యత్వాన్ని మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (మా) రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ అంశంపై హేమ బహిరంగ లేఖను విడుదల చేశారు. డ్రగ్స్ కేసులో తాను నిర్దోషినని, తిరిగి తన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ లేఖను 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకు అందజేసింది. 'మీడియాలో నాపై వస్తున్న నిరాధారమైన ఆరోపణల నేపథ్యంలో దేశంలోనే అత్యున్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్‌లో నేను పరీక్షలు చేయించుకున్నా. వాటిలో నేను డ్రగ్స్ తీసుకోలేదని తెలిసింది. త్వరలోనే పోలీసులు చేసిన పరీక్షల్లోనూ అవే ఫలితాలు వస్తాయని నాకు నమ్మకం ఉంది. ఈలోపే నన్ను దోషిగా భావించి 'మా' సభ్యత్వం రద్దు చేయడం సరైంది కాదని భావిస్తున్నా. ఈ పరిస్థితుల్లో 'మా'నాకు అండగా ఉండి..నాపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేస్తారని ఆశిస్తున్నా' అని హేమ తన లేఖలో పేర్కొంది.

నవ్వులు పంచే చతుర్ వితుర్

ఆర్వీ సినిమాస్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'అరి'. జయశంకర్ దర్శకుడు. వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ సినిమాలో హాస్య నటులు శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర చతుర్, వితుర్ పాత్రల్లో కనిపించనున్నారు. సోమవారం వారిద్దరి పోస్టర్‌ను విడుదల చేశారు. అరిషడ్వర్గాలు కాన్సెప్ట్ ఆధారంగా సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో పాటు కథలోని వినోదం కూడా ఆకట్టుకుంటుందని, ఓ విభిన్నమైన పాయింట్‌తో ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, రచన-దర్శకత్వం: జయశంకర్.

డివోషనల్ థ్రిల్లర్ షణ్ముఖ

మైథాలజీతో కూడిన థ్రిల్లర్ చిత్రాలకు ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. కార్తికేయ2, కాంతారా, హను-మాన్, కల్కి సినిమాలే అందుకు నిదర్శనాలు. ఆ కోవలోనే త్వరలో రానున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో అవికాగోర్ కథానాయిక. తులసీరామ్ సాప్పని, రమేశ్ యాదవ్‌లతో కలిసి షణ్ముగం సాప్పని స్వీయదర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ని సోమవారం విడుదల చేశారు. పోలీస్ యూనిఫామ్‌లో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న ఆదిని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆయన వెనుక సుబ్రహ్మణ్యస్వామి కనిపిస్తుండటం ఈ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణ. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని అద్భుతమైన పాయింట్‌తో సినిమాను తెరకెక్కిస్తున్నామని, పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి పాత్ర హైలైట్‌గా ఉంటుందని దర్శకుడు చెప్పాడు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.